వ్యర్థ రసాయనాల ట్యాంకర్ పట్టివేత

గ్రామస్తులు పట్టుకున్న వ్యర్థ రసాయనాల ట్యాంకర్

భూదాన్ పోచంపల్లి, జూన్ 12 : కంపెనీ నుంచి వెలువడిన వ్యర్థ రసాయనాల ట్యాంకర్‌ను గ్రామస్తులు పట్టుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దోతిగూడెం గ్రామ శివారులోని కెమిక్ లైఫ్ సైన్స్ కంపెనీకి చెందిన వ్యర్థ రసాయనాల ట్యాంకర్‌ను తీసుకెళ్తుండగా గ్రామస్తులు గమనించి అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గతంలో పలుమార్లు పీసీబీ అధికారులు అప్పగించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని పోలీసులతో గ్రామస్తులు వాగ్వాదం చేశారు. మామూళ్లకు అలవాటు పడి అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీబీ అధికారులు వచ్చేవరకు ట్యాంకర్‌ను కదలనివ్వబోమని గ్రామస్తులు పట్టుబట్టారు. కంపెనీ నుంచి వెలువడుతున్న రసాయన పదార్థాలను వేరే ప్రాంతానికి తరలిస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కంపెనీలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ బాలం మల్లేశ్, బద్దం వెంకట్‌రెడ్డి, ముద్దం సత్యం, గ్రామస్తులు డిమాండ్ చేశారు. కాగా, ట్యాంకర్ డ్రైవర్ పరారయ్యాడు. గ్రామస్తుల ఫిర్యాదుతో సంఘటన స్థలానికి పీసీబీ అధికారి పురుషోత్తంరెడ్డి వచ్చి శాంపిల్స్ సేకరించారు. శాంపిల్‌ను లేబొరేటరీకి పంపించి నివేదిక వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి

- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 1800 పాఠశాలల్లో పనులు
- ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన

మాల్‌లోని హైస్కూల్‌లో విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ కంకణాల ప్రవీణా వెంకట్‌రెడ్డి, ఎంపీపీ భవాని

రామగిరి, జూన్ 12: బడిఈడున్న పిల్లలందరూ బడులల్లోనే ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసమే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్పీరోడ్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థినులకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా 2 లక్షల దుస్తులను కుట్టించి పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జిల్లాలోని 1800 పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కొత్త తరగతి గదులను నిర్మించామని, డైనింగ్ హాల్‌కు పెయింటింగ్ పనులు రెండు రోజుల్లో పూర్తి అవుతాయన్నారు. విద్యార్థినులు మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని, ఉపాధ్యాయులు ఈ విషయమై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించడమే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, డీఈఓ భిక్షపతి, ఎంఈఓ అరుంధతి, స్థానిక కౌన్సిలర్ రైసా మాసూమ్, పాఠశాల హెచ్‌ఎం పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు: ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుండడంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, యూనిఫాంను ఎమ్మెల్యే అందించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, తాసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, ఎంఈఓ మేక నాగయ్య, ఇనుపాముల ఎంపీటీసీ బొజ్జ సుందర్, మల్లయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి : ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ/వేములపల్లి, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. ప్రొఫెసర్ జయశంకర్‌సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి, వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం డిజిటల్ పద్ధతిలో విద్యాబోధనను పరిశీలించారు. మరుగుదొడ్లను, మూత్రశాలలను పరిశీలించి వాటిని పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ హరిబాబు, ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఎంఈఓ బాలాజీనాయక్, హెచ్‌ఎంలు లావూరి బాలు, వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ నాగమణి, నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, మైబెల్లి, వేములపల్లిలో ఎంపీపీ పుట్టల సునీతాక్రిపయ్య, జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, ఎంపీటీసీ పల్లా వీరయ్య, ఎంఈఓ బాలాజీనాయక్, నోడల్ అధికారి లక్ష్మణ్‌నాయక్, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలి : ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), జూన్ 12 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ కోరారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎంఈఓ సామ్యానాయక్ యూనిఫాంను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు జాన్‌యాదవ్, బిక్కునాయక్, పార్వతీచందునాయక్, జడ్పీటీసీలు అరుణాసురేశ్‌గౌడ్, బుజ్జీలచ్చిరాంనాయక్, బాలూనాయక్, ఎంపీడీఓ సరోజ, ఎంఈఓ మాత్రునాయక్, సామ్యనాయక్, కిన్నెర హరికృష్ణ, ముక్కమల వెంకటయ్యగౌడ్, పాపానాయక్, రమేశ్, సుభాశ్, బద్యానాయక్, నాగేశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

త్రిపురారంలో..

త్రిపురారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జడ్పీటీసీ భారతీభాస్కర్‌నాయక్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సలహాదారుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కర్నాటి వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పడిశెల మంగమ్మ, మండల నోడల్ అధికారి రవినాయక్, ముడిమల్ల బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గట్టుప్పల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీపీ అవ్వారి గీతా శ్రీనివాస్ పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గొడకొండ్ల హైస్కూల్‌లో..

మాల్, జూన్ 12 : చింతపల్లి మండలం గొడకొండ్లలోని వెంకటేశ్వరనగర్ హైస్కూల్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ కంకణాల ప్రవీణా వెంకట్‌రెడ్డి, ఎంపీపీ కొండూరి భవానీ పవన్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, ఎంఈఓ గురువారావు, ఏపీఎం విజయలక్ష్మి, జీవన్‌సింగ్, ఆడపాల వాణి, చంద్రకళ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య : ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతున్నదని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదుగాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పెర్కకొండారం గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందించారు. పాఠశాలలో టెన్త్ ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ఇద్దరు విద్యార్థులను , ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర రణీలాయాదగిరి, ఎంపీడీఓ రేఖల లక్ష్మయ్య, ఎంఈఓ నాగయ్య, హెచ్‌ఎం సైదులు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు ఇంతియాజ్, సత్తయ్యయాదవ్, రంగారెడ్డి, యుగేందర్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

దేవరకొండలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్

మిర్యాలగూడ : యాద్గార్‌పల్లి పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

శాలిగౌరారం : పెర్కకొండారం జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదుల సామేల్

కేతేపల్లి : జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫామ్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

గట్టుప్పల్ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీపీ గీతాశ్రీనివాస్

త్రిపురారం : విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందచేస్తున్న జడ్పీటీసీ భారతీభాస్కర్‌నాయక్

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

- బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ లక్ష్మణ్

భూదాన్ పోచంపల్లి, జూన్ 12 : విద్యాహక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25 నుంచి వచ్చే నెల ఐదో తేదీ వరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ మాదిగ తెలిపారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్, ట్యూషన్ ఫీజులు పేద విద్యార్థులకు శాపంగా మారాయన్నారు. కోచింగ్‌ల పేరుతో విద్యను వ్యాపారం చేస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని తెలిపారు.

విద్యా దోపిడీని అరికట్టి, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. సమావేశంలో నాయకులు రమేశ్, భూషణ్, బాలనరసింహ, లింగయ్య, వెంకటేశం, ప్రభాకర్, లింగస్వామి, శంకర్, శ్రీనివాస్, భిక్షపతి పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారు

- ఆర్డీఓకు విన్నవించిన చేనేత కార్మికులు


ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న చేనేత కార్మికులు

చౌటుప్పల్, జూన్ 12 : చౌటుప్పల్ చేనేత సహకార సంఘంలో అవినీతిని ప్రశ్నిస్తే తమపై పాలకవర్గ సభ్యులు దాడులకు యత్నిస్తున్నారని చేనేత కార్మికులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రశ్నించిన తమపై దుర్భాషలాడుతున్నారని, తక్షణమే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గోశిక స్వామి, లక్ష్మయ్య, భాస్కర్, నర్సింహ, జెల్ల నారాయణ, కడవేరు శంకరయ్య, సుంకి రవి, కర్నాటి జనార్దన్, గంజి శ్యాంసుందరం, మాకం శివాజీ పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్ పూర్తయ్యాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి'

తుర్కపల్లి, జూన్ 12 : బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని శ్రీకృష్ణ యాదవ సంఘం మండలాధ్యక్షుడు సీసరాజు యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బీసీ మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అసెంబ్లీలో కుల గణన బిల్లుకు ఆమోదం తెలిపి చట్టబద్ధత కల్పించాలన్నారు. విధివిధానాల కోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ నెల 15న ఇందిరాపార్క్ వద్ద జరిగే బీసీల మహాధర్నాకు అధిక సంఖ్యలో రావాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటేశ్, నాయకులు గుంటి గణేశ్, కర్ణాకర్, పాండు, ఐలేశ్, రమేశ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పంచాయితీలను గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలి

ఆత్మకూరు(ఎం), జూన్ 12 : చిన్న చిన్న వ్యక్తిగత పంచాయితీలను గ్రామాల్లోనే పరిష్కరించుకొని కలిసిమెలిసి ఉండాలని ఏఎస్ఐ సైదులు అన్నారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ పంచాయితీ తీర్మానాల కోసం బుధవారం పోలీస్‌స్టేషన్‌కు రాగా కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతి చిన్న విషయానికి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయకుండా గ్రామాల్లోనే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం : సీపీఎం

బొమ్మలరామారం, జూన్ 12 : ప్రజల సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. రెవెన్యూ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం రెవెన్యూ అధికారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణిలో దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యలు పరిష్కారం కాక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. రైతుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, నాయకులు బ్రహ్మచారి, లక్ష్మయ్య, కిష్టయ్య, ఎల్లయ్య, పున్నమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల కోసం దళారులను ఆశ్రయించొద్దు

- ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ, జూన్ 12 : విద్యార్థులు, తల్లిదండ్రులు సర్టిఫికెట్ల కోసం దళారులను ఆశ్రయించొద్దని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు సూచించారు. బుధవారం తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమైనందున వివిధ రకాల కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులకు అవసరమయ్యే ధ్రువపత్రాల కోసం తాసీల్దార్ కార్యాలయానికి నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొంత మంది తల్లిదండ్రులు దళారులను ఆశ్రయించి అధికంగా డబ్బులు చెల్లించి మోసపోతున్నారని తెలిపారు. తాసీల్దార్ కార్యాలయం వద్ద ప్రతి సర్టిఫికెట్‌కు చెల్లించాల్సిన ఫీజు వివరాల పట్టికను ఏర్పాటు చేశామని, మీసేవా కేంద్రాల్లో గాని దళారులుగానీ అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తూ తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గురువారం నుంచి 9 గంటలకే తాసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్లు అందించే సేవలు ప్రారంభమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులు ఎండిపోయాయని, ఇదే అదనుగా కొంతమంది చెరువు భూములను కబ్జా చేశారని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెలాఖరులోగా చెరువులన్నింటికీ సరిహద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ భూముల్లో అనుమతులు లేకుండా బోర్లు వేయవద్దని, అలా వేస్తే బోర్‌వెల్ యంత్రంతో పాటు బోర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై, ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై కూడా కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ఎన్‌జీ కళాశాల ఎన్‌సీసీ అధికారికి రెడ్‌క్రాస్ అవార్డు

రామగిరి, జూన్ 12 : జూన్ 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అందించే రాష్ట్రస్థాయి అవార్డుకు ఎన్‌జీ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ చిలుముల సుధాకర్ ఎంపికైనట్లు సొసైటీ జిల్లా కమిటీ ఒక ప్రకటలో తెలిపింది. ఈ నెల 14న హైదరాబాద్‌లోని రాజభవన్‌లో గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందించనున్నట్లు పేర్కొన్నారు. అవార్డుకు ఎంపికైన సుధాకర్‌ను ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ లక్ష్యారెడ్డి, ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ఉపేందర్, అధ్యాపకులు అభినందించారు.

'వెలిమినేడు పాలసంఘం ఎన్నికలు నిర్వహించాలి'

చిట్యాల, జూన్ 12 : వెలిమినేడు పాల సంఘం ఎన్నికలు నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ వెల్మినేడు గ్రామశాఖ అధ్యక్షుడు ఆరూరి శ్రీశైలం డిమాండ్ చేశాడు. బుధవారం నిర్వహించిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘానికి సంబంధించిన ఓటరు జాబితాను ప్రతి సంవత్సరం మే లో రూపొందించి జూన్‌లో ఎన్నికలు నిర్వహిస్తారని, కానీ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఓటరు జాబితాను ప్రదర్శించకుండా కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ ఓటరు జాబితాను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. సమావేశంలో పాల సంఘం చైర్మన్ గడ్డం సూర్యప్రకాశ్‌రెడ్డి, నాయకులు దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాతి శ్రీనివాసు, చిర్రబోయిన రవి, పైళ్ల రఘుమారెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

సారా తయారీదారులపై కఠిన చర్యలు : ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

కొండమల్లేపల్లి, జూన్ 12 : గ్రామాల్లో ఎవరైనా నాటుసారాయి తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం ఎక్సైజ్ అధికారులు మండలంలోని అంగోతుతండాలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. తండాలో లభించిన 500 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు వీరబాబు, మల్లేశ్, నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలికి ఘన నివాళి

రాధమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కట్టంగూర్, జూన్ 12 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు గోదల రాధమ్మ 12వ వర్ధంతిని బుధవారం మండలంలోని పందనపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాధమ్మ చిత్రపటానికి గ్రామస్తులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు గోదల కృష్ణారెడ్డి, కుంభం తారకమ్మ, బండారు వెంకట్‌రెడ్డి, గోదల యాదవరెడ్డి, కుంభం సరిత, గద్దపాటి యాదయ్య, కొండి సోమిరెడ్డి, బండ అచ్చమ్మ, గడ్డం వసంత, భిక్షంరెడ్డి, గజ్జి నర్సమ్మ, బండారు ఊర్మిళ, గోదల వరమ్మ, విమలమ్మ, నర్సయ్య, లచ్చయ్య, గోదల జ్యోతి, కొండి మమత, రాములమ్మ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో మిషన్ భగీరథ అధికారుల సర్వే

అడవిదేవులపల్లిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

త్రిపురారం, జూన్ 12 : మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికి అందుతుందా లేదా అనేది తెలుసుకునేందుకు చేపడుతున్న ఇంటింటి సర్వే బుధవారం మండలంలోని బాబుసాయిపేట గ్రామంలో చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు సారథ్యంలో సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రతిరోజు నీళ్లు వస్తున్నాయా, ట్యాంక్‌లను శుభ్రపరుస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.మధు, ఏఈ మోహన్‌గాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి, జూన్ 12: మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికీ అందుతుందా అనే విషయమై సంబంధిత అధికారులు బుధవారం పలు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ పి.కరుణాకర్‌రావు, ఎంపీఓ మోసిన్‌బిన్ అహ్మద్ సర్వేను పర్యవేక్షించారు.

చల్మారెడ్డిగూడెం విద్యార్థినికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి అభినందనలు

విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, జూన్ 12 : జెఈఈ మెయిన్స్‌లో 44వ ర్యాంక్ సాధించిన అనుముల మండలం చల్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన కోరేపాక శ్రీజనిని బుధవారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగాలని ఆకాంక్షించారు.

నల్లగొండలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం

నల్లగొండ పట్టణంలో బ్యాంక్‌ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ కె. శివరాంరెడ్డి, బ్యాంక్ హైదరాబాద్ జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, సిబ్బంది

నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను బుధవారం డీఎస్పీ కె. శివరాంరెడ్డి, బ్యాంక్ హైదరాబాద్ జోనల్ మేనేజర్ జీఎస్‌డి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి ఇన్‌చార్జి ఏఓగా సైదానాయక్

అడవిదేవులపల్లి, జూన్ 12 : మండల ఇన్‌చార్జి ఏఓగా డి. సైదానాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఏఓ అర్చన సెలవుపై వెళ్లడంతో మాడ్గులపల్లి ఏఓ సైదానాయక్‌కు మండల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

చోరీ కేసులో ఇద్దరు మహిళలు అరెస్ట్

- రూ.6 లక్షల విలువైన నగలు, నగదు స్వాధీనం


నిందితుల నుంచి రికవరీ చేసిన నగలు, నగదును పరిశీలిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, జూన్ 12: చోరీ కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6 లక్షల విలువైన బంగారు నగలు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణ సమీపంలోని రవీంద్రనగర్ కాలనీకి చెందిన కంచర్ల ఊర్మిల, జగన్మోహన్ రెడ్డి దంపతులు నివాసముంటున్నారు. ఇటీవల వారు తమ ఇంటికి రంగులు వేయించారు. అనంతరం మే 30న వారి ఇంట్లోంచి 8 తులాల బంగారు ఆభరణాలు, రూ.85వేల నగదు కనిపించకుండా పోయాయి. అయితే ఇంట్లో రంగులు వేయడంతో ఎక్కడైనా పెట్టి ఉండొచ్చని భావించి ఇల్లంతా వెతికారు. ఆభరణాలు, నగదు కనిపించకపోవడంతో ఈ నెల 5న మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ నగేశ్ విచారణ చేపట్టారు. 15 రోజులుగా వారి ఇంటికి వచ్చి వెళ్లిన వారి వివరాలు సేకరించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఇద్దరు మహిళలు నగలు, నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా వారు నేరం అంగీకరించారు. వారి నుంచి 8 తులాల బంగారు ఆభరణాలు, రూ.85వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

రాష్ట్ర ప్రభుత్వం గుట్కాలను నిషేధించడంతో ఎస్పీ చందనాదీప్తి ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ సుధాకర్, ఎస్ఐ శేఖర్ బుధవారం పలు దుకాణాలల్లో సోదాలు నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న గోపాలపు రాజు దుకాణంలో, సీతారాంపురం కాలనీకి చెందిన ఆకుతోట నరసింహ దుకాణాలపై దాడులు నిర్వహించి రూ.12.52 లక్షల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

నిడమనూరు, జూన్ 12 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్. రంజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు గణితం బోధించేందుకు ఎమ్మెస్సీ(మ్యాథ్స్), బీఈడీ అర్హత కలిగిన వారు, ఇంగ్లిష్ బోధించేందుకు ఎంఏ(ఇంగ్లిష్), బీఈడి, 6 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లిష్ బోధించేందుకు ఎంఏ, బీఈడీ, టెట్ అర్హత ఉన్నవారు, 6 నుంచి 10వ తరగతి వరకు హిందీ బోధించేందుకు హెచ్‌పీటీ, టెట్ అర్హత గల వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 4.30 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.